# స్నేహి

రచన: టి. రాఘవేంద్రరావు



బయట మండుటెండ.

మధ్యాహ్నం ఆ మండుటెండలో ధనంజయశాస్త్రిగారు నూతి దగ్గరకు వెళ్ళారు. గట్టుకు ఆనుకుని నిలబడితే కాస్త చల్లగా వుంది. నాలుగు బాల్చీల నీళ్ళు నెత్తిమీద గుమ్మరించుకున్నారు.

మడితో లోపలకు వెళ్ళి కుంపటిమీద అన్నం వండుకున్నారు.

ఎర్రటి పండుమెరపకాయలు, చింత పండు కలిపి రోట్లోవేసి పచ్చడి చేసుకున్నారు. నెయ్యి, పెరుగు, పక్కన పెట్టుకుని భోజనానికి కూర్చున్నారు. వారంలో మూడు నాలుగురోజులు ఇదే తిండి. రెండు రోజులు పస్తు లుంటారు.

పల్లెలో పెద్ద ఇల్లు. ఇంటి పక్కనుంచే ఆరంభమయ్యేది ఆయన పొలం హద్దు. పదెకరాలు. పెద్ద ఆస్తి కిందకు లెక్కకు రాదు. అయినా శాస్త్రిగారి జరుగుబాటుకేం లోటు లేదు.

మధ్యాహ్నం తొందరగా కునుకు రాదు. వాల్మీకి రామాయణం పాత ప్రతి ఎప్పటిదో వుంది. నాలుగు పేజీలు శ్లోకాలు, వ్యాఖ్యానం చదివేసరికి కళ్ళు మూసుకువస్తాయ్.

ఆ మధ్యాహ్నం శాస్త్రిగారు మగత నిద్రలో వున్నారు. పోస్ట్‌మాన్ పిలుపు విని లేచి బయటికి వచ్చారు. ఉత్తరం అందుకుని లోపలకు వచ్చారు. ఆ వూరికి మూడు గంటల తరువాత కాని పోస్టు రాదు. పొరుగూరినుంచి రన్నర్ తెచ్చి ఇస్తాడు.

ఉత్తరాలిచ్చే రన్నర్ మాత్రం "కులాసానా, శాస్త్రిగారు" అంటూ పలకరిస్తాడు. అతను మామూలుగా అన్న మాటలే అయినా ఎంతో గౌరవం వుంటుంది. ఊళ్ళో శాస్త్రిగారిని పలకరించడానికి భయమూ, భక్తి అడ్డొస్తాయ్. మునసబు, కరణాలు మాత్రమే చనువుతో ఆయన్ని పలకరించేవారు.

శాస్త్రిగారు లోపలకు వెళ్ళి చెంబులోంచి మంచినీళ్ళు గటగటా తాగి కుదుటపడ్డారు. ఎప్పుడు ఉత్తరం వచ్చినా వెంటనే చూసేవారు కాదు.

నెమ్మదిగా జాబు చదవడం ప్రారంభించారు. ఈసారి కూతురు పార్వతి రాయలేదు. ప్రతిసారీ ఆమే రాసేది. ఈసారి జాబులో క్రింద జయదేవిడ్ అని వుంది. జాబును దూరంగా విసిరివేశారు. మూలన పడిపోయింది.

కళ్ళు మూసుకుని ఆలోచనలో పడ్డారు.

ఆయన నయనాలు సజలాలయ్యాయ్. ఆ జలచిత్ర చయనికలో గతం అస్పష్టంగా కనిపించింది. ఎండిపోయిన జీవన స్రవంతి ఆయన గతం. ఆ స్రవంతిలో ఇనుకమేటలు, చెట్ల పొదలు, ముళ్ళ చెట్లు. అక్కడక్కడ నీటిచలములు.

జీవితం తనతో ఆడుకుంది.

పార్వతిని ప్రసవించి భార్య పోయింది. పార్వతికి కష్టాలొస్తాయని శాస్త్రిగారు మళ్ళీ పెళ్ళాడలేదు.

గారాబంగా కూతుర్ని పెంచారు.

ఎప్పుడూ వేదాంత ధోరణే. సాంగత్యం అవసరం అనిపించేది కాదు. ఆధ్యాత్మిక చింతన గాఢంగా, ఒక ప్రవృత్తిలా ఆయనలో నిలిచిపోయింది.

పార్వతి ఎదుగుతూ వుంటే ఆయన కళ్ళముందు ఏదో పూలచెట్టు పెరుగుతున్నట్టు ఆనందించేవారు. ఆ ఆనందానికి హద్దుండేది కాదు.

పెళ్ళీడు వచ్చాక పార్వతికి పెళ్ళిచేశారు.

అల్లుడు రామ్మూర్తి. ఉద్యోగం పెద్దదే. ఈడూ, జోడూ.

పదేళ్ళు చక్కగా గడిచాయ్.

పార్వతికి పిల్లలు కలగలేదన్న కొరత మాత్రమే మిగిలింది.

రామ్మూర్తికి పార్వతి మీద ఉదాసీనత హెచ్చింది. పార్వతి వచ్చినప్పుడల్లా తండ్రితో చెప్పి బాధపడేది. శాస్త్రిగారు భగవంతుని ప్రార్థించడం తప్ప ఇంకేమీ చేయలేకపోయారు.

"అమ్మా వ్రతాలు, పూజలు, యాత్రలు ఎన్నయినా చేయగలం. దేవుడి దయ వుండాలి కదా"

మరి రెండేళ్ళు గడిచాయ్.

ఓరోజు పిడుగులాంటి వార్త రామ్మూర్తి, భార్య చెవిన వేశాడు.

"నేను మా ఆఫీసులో టైపిస్టు ఫిలోమినాను పెళ్ళి చేసుకున్నాను"

"నేనేం పాపం చేశాను" అంది పార్వతి.

"పాపపుణ్యాల ప్రసక్తి లేదు. నాకూ, ఫిలోమినాకు స్నేహం కుదిరింది. శారీరకంగా కలిశాం. ఆమె మూడునెలల గర్భవతి. పిల్లలమీద ప్రేమతో నేను ఆవిడను పెళ్ళి చేసుకున్నాను"

ఇన్నేళ్ళ కాపరంలో పార్వతి పిల్లల్ని కనలేకపోయిందన్న నింద, రామ్మూర్తి మాటల్లో ధ్వనించింది.

"నన్ను వెళ్ళిపొమ్మంటారా" అంది దీనంగా.

"అనను. నువ్వూ మాతోపాటు వుండవచ్చు. నీతోపాటు ఫిలోమినా వుంటుంది. రేపు ఇక్కడికి వచ్చేస్తుంది."

రామ్మూర్తి అన్నట్టే మర్రోజు ఫిలోమినా వచ్చేసింది. అక్కడే వుండిపోయింది. ఆరోజు ఇంట్లో ఆఫీసువాళ్ళకు పార్టీ కూడా ఇచ్చారు.

"అక్కయ్యా" అంటూ పార్వతి వెంట తిరిగింది ఫిలోమినా. పార్వతికి తప్పలేదు.

అవమానాన్ని దిగమింగి నలుగురితో పాటు తిరిగింది. ఇలాగయినా పిల్లలు కావాలనే భర్త కోరిక నెరవేరడం తనకూ సంతోషమే అనుకుంది.

రెండు రోజుల్లో అంతా కలిసిపోయారు. పార్వతికి ఇబ్బంది అనిపించలేదు.

రామ్మూర్తి పార్వతిని తక్కువగా చూడలేదు. ప్రేమగానే చూసుకోసాగాడు.

"నిన్ను అసహ్యించుకునే ఉద్దేశం నాకు లేదు. నిన్ను ఉదాసీనంగా కూడా చూడను. హాయిగా వుండు" అన్నాడు.

పార్వతికి అదే సరియైన మార్గం అనిపించింది. తండ్రి ఒంటరి మనిషి. అతనికి భారంగా వుండి కష్టం కలిగించదలచుకోలేదు. ఒకనాడు తండ్రిని చూడాలనిపించి ప్రయాణమై వెళ్ళింది. హఠాత్తుగా వచ్చిన కూతుర్ని చూసి ఆశ్చర్యపోయారు శాస్త్రిగారు.

"ఉత్తరం కూడా రాయలేదు" అన్నారు.

"ఉత్తరంలో రాయాల్సింది కాదు నాన్నా" అంటూ జరిగింది చెప్పేసింది.

"అమ్మా, నువ్వెలా సహించావ్. నాకు జాబు రాస్తే నేను వచ్చేవాడిని కదా. ఆ వెధవని తన్ని తగలేసి నిన్ను శాశ్వతంగా తీసుకువచ్చేవాడిని" అన్నారు శాస్త్రిగారు ఉగ్రులై.

"నాన్నా, నువ్వు ఏకాకివి. ఎంత కాలం నన్ను చూసుకుంటావ్. పదేళ్ళ కాపురం తరువాత నేను ఆయన్ని వొదిలే స్థితిలో లేను. నామీద ఆపేక్షగానే వుంటున్నారు. నన్ను హింసించడం లేదు కదా" అంది.

"సంకరమైపోయిన ఆ వాతావరణంలో ఎలా వుంటున్నావమ్మా. నేను ఎలా సహించగలను. నాకూ, నీకు ఎలా కుదుర్తుంది. అగ్నిహోత్రం లాంటి వంశం మాది" అన్నాడు.

"కాలం మారింది నాన్నా. ఎవరో ఏదో అయితే మనం దూరంనుంచి విమర్శించవచ్చు. అదే మనకు జరిగితే ఏమీ చేయలేము. నువ్వు, నేనూ తప్ప మన కుటుంబంలో ఎవరు వున్నారు. నీకు ఏదైనా అయితే, నాకేమైనా జరిగితే ఒంటరిగా ఎవరో ఒకరు మిగిలిపోవలసిందే కదా"

శాస్త్రిగారికి పార్వతి మాటలు నచ్చలేదు.

"నేను ఆ ఇంట్లో అడుగుపెట్టను. నీ ఇష్టం" అన్నారు.

రెండు రోజుల తర్వాత పార్వతి వెళ్ళిపోయింది.

ఆ రెండురోజులూ శాస్త్రిగారు ముభావంగానే వున్నారు. తనే వంట చేసి పెట్టారు.

"నీ చేతి వంట తినలేను" అన్నారు.

పార్వతి బాధపడింది.

"సరే నాన్నా. నేను ఎవరిమీదా కోపగించుకోలేను. నిస్సహాయ స్థితి నాది" అని వాపోయింది.

"పోనీ ఎవ్వడయినా వస్తే" అంది.

"పెరట్లోని గదిలో వుండవచ్చు" అన్నారు. శాస్త్రిగారు.

పార్వతికి దుఃఖం ఆగింది కాదు.

తండ్రికి తెలియకుండా పెరట్లో వేపచెట్టు కింద కూర్చుని రోదించింది.

మళ్ళీ శాస్త్రిగారు కూతురి ఇంటి గడప తొక్కలేదు.

పార్వతి కూడా రాలేదు.

తండ్రిమీద మమకారంతో ఉత్తరాలు రాసేది.

"ఉత్తరమైనా అందుకో నాన్నా. కాగితానికి అంటు వుండదుకదా" అని రాసేది.

శాస్త్రిగారి గుండెలో బడబానలం ప్రజ్వలించేది. కానీ మెత్తబడలేదు. పట్టు వదలలేదు.

మళ్ళీ ఈరోజు జాబు.

శాస్త్రిగారు మూలన పడివున్న ఉత్తరంకేసి చూశారు. గాలికి రెపరెప కొట్టుకుంటుంది. తన కూతురే విలవిలలాడినట్టు అనిపించింది.

లేచి వెళ్ళి జాబు తీసుకున్నారు.

"అమ్మకు ఒంట్లో బాగా లేదు. ఆసుపత్రిలో చేర్పించాము. తాతగారు రావాలి" కింద జయడేవిడ్ అనే సంతకం.

శాస్త్రిగారిలో అన్నేళ్ళ బాధాగ్నిజ్వాల రేగింది.

ఉండలేకపోయారు. ప్రయాణమై వెళ్ళారు.

ఆసుపత్రి దగ్గరకు సరాసరి వెళ్ళారు.

పడక నంబర్ తెలుసుకుని వెళ్ళి కూతురి ముందు నించున్నారు.

పార్వతి బాగా నీరసించిపోయింది.

శాస్త్రిగారి కడుపులో నిండుకున్న చెరువంత దుఃఖం పొంగిపొర్లింది.

అభిమానపు ఆనకట్ట కళ్ళదగ్గర గట్టిగా అడ్డుకుంది. కన్నీళ్ళు రాలేదు.

పార్వతి తండ్రి మొహంకేసి చూసింది.

చిన్నపిల్లలా చేతులు సాచింది.

శిలావిగ్రహంలా నిలబడిపోయారు శాస్త్రిగారు.

ఇంతలో ఇద్దరు మగపిల్లలు వచ్చారు. రాగానే 'అమ్మా' అంటూ పార్వతిని పెనవేసుకున్నారు.

ఇద్దరిదీ ఒకే పోలిక.

"కవలలు" అని గొణిగింది పార్వతి తండ్రి వినాలని.

శాస్త్రిగారు ఆశ్చర్యంతోను, సంభ్రమంతోను చూస్తున్నారు.

ఒక కుర్రాడు పడకమీద కూర్చుని పార్వతి తలను తన ఒడిలోకి తీసుకున్నాడు. మరో కుర్రాడు పళ్ళరసం, పాలూ చెరో గ్లాసులో పోశాడు.

"అమ్మా పిన్ని రాలేదా" అంటున్నాడు.

"వస్తుంది నాయనా" అంది పార్వతి.

శాస్త్రిగారికి అర్థమైపోయింది.

ఆ పిల్లలు పార్వతికి అలవాటుపడ్డా. ఆవిడే వాళ్ళకు తల్లి అయిపోయింది.

"నాన్నా, అలా కుర్చీలో కూచో" అంది పార్వతి బలహీనంగా.

యాంత్రికంగా శాస్త్రిగారు కుర్చీలో కూర్చున్నారు.

"అమ్మా, నీకు వొళ్ళుతెలీని జ్వరం వస్తే విషజ్వరం అన్నారు. ఇద్దరం భయపడిపోయాం. డేవిడ్ అన్నయ్య గుడికి వెళ్లి వచ్చాడు. అబిషేకం కూడా చేయించాడు" అన్నాడు ఒక కుర్రాడు.

"జోసఫ్ అంతేనమ్మా. శనివారం ఒక రోజంతా ఉపవాసం చేశాడు"

అంతకుముందే ఫిలోమినా, రామ్మూర్తి వచ్చి నుంచున్నది గమనించలేదు శాస్త్రిగారు.

"నాన్నగారూ, నేను కన్నానన్న మాటే కాని, తల్లి పార్వతక్కయ్యే" అంది ఫిలోమినా.

అప్పటిదాకా కళ్ళ దగ్గర ఆనకట్ట వెనుక దాగిన కన్నీళ్ళు ధారాపాతంగా ప్రవహించాయ్ శాస్త్రిగారి ముడతలు పడ్డ చెక్కిళ్ళమీద.

తండ్రి దుఃఖాశ్రువులు చూసి పార్వతికి ఏడుపాగింది కాదు. అంత దుఃఖంలోనూ ఆనందం వేసింది.

'నాన్న ఇంతకాలానికి అనురాగాలు, అభిమానాలు తెలుసుకోగలిగారు' అనుకుంది.

"పార్వతీ నేను సుందరరామయ్య ఇంట్లో దిగాను. రెండు రోజులు అక్కడే వుంటాను" అంటూ బయలుదేరారు.

ఆ రెండు రోజులూ ఆసుపత్రికి వచ్చేవారు.

మూడోరోజు పొద్దున పార్వతిని డిశ్చార్జి చేశారు.

రామ్మూర్తి తెచ్చిన టాక్సీలో ఇద్దరు పిల్లలూ "అమ్మా జాగ్రత్త" అంటూ నెమ్మదిగా నడిపించుకుని వెళ్ళి టాక్సీలో కూచోబెట్టారు.

రామ్మూర్తి నమస్కరించాడు.

శాస్త్రిగారు కళ్ళతోనే ఆ నమస్కారాన్ని స్వీకరించారు.

ఇంతలో సుందరరామయ్య వచ్చాడు. టాక్సీలో కూచున్న పార్వతి యోగక్షేమాలు విచారించాడు. శాస్త్రిగారి పక్కన - నిలబడ్డాడు.

టాక్సీ కదిలింది.

మనస్సులో భగవంతునికి నీరాజనాలర్పించారు. తన కూతురు మహాసాధ్విలా కనిపించింది.

"సుందరాముడూ! నాతర్వాత పార్వతి దిక్కులేనిదయిపోతుందనుకున్నాను. భగవంతుడు ఎంత గాఢమయిన అనుబంధాన్ని సృష్టించాడు" అన్నారు.

"అవున్రా ధనుంజయా. కానీ ఇదివరకు నువ్వు ఒక్కటి గమనించలేకపోయావ్. నువ్వు భరతవర్షే అంటూ సంధ్యావందనంలో సంకల్పంలో చెప్పకుంటావు. ఆ భరతవర్షం అంటే భరతమాత అన్ని సంస్కృతుల్నీ తనలో కలుపుకుని అన్నిమతాల వారిని బిడ్డలుగా చూసుకోవడంలేదూ! ఎవర్నయినా తన్ని తరిమేసిందా? మన ఇల్లు కూడా అంతే. భరతమాత లాంటిది" సుందరరామయ్య మాటలు వింటూ శాస్త్రిగారు తన్మయులయ్యారు.

*

## పేరెందుకు?

నీతులెందుకు జీవించనీ 'వాళ్ళని' అన్నాడతను
ప్రతీదాన్ని తట్టిలేపే పనిలో నిమగ్నమయినవాడు.
'మాటలెందుకు పనిచేయనీ వాళ్ళ'ని అన్నాడతను
ప్రతి మట్టిపెళ్ళనీ పలకరించి పరవశించేవాడు.
'నడవనీ, నడవనీ, ఆగకుండా నడవనీవాళ్ళని
'గమ్యమా ఆగమ్యమా' అని అడగొద్దు వాళ్ళని
అని అన్నాడతను.
విగ్రహ విధ్వంసకుడయిన ఒక వినూత్న విప్లవకారుడు.

శివారెడ్డి